జూన్‌లో గోదావరి జలాలతో సాగుకు చర్యలు

రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు
ఆయిల్‌ఫాం కొత్త కర్మాగారానికి శంకుస్థాపన



కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

వేంసూరు, మార్చి 30: వర్షాలతో సంబంధం లేకుండా ఖమ్మంజిల్లా రైతులు జూన్‌లో గోదావరి జలాలతో సాగు పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకుంటున్నామని రాష్ట్ర వ్యవసాయ మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళీశాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. ఆదివారం ఖమ్మంజిల్లా వేంసూరు మండలం కల్లూరుగూడెంలో మంత్రి తుమ్మల సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయిదయానంద్, టీజీ ఆయిల్‌ఫెడ్ ఎండీ యాస్మిన్‌బాషా, ఆయిల్‌ఫెడ్ చైర్మన్ జంగా రాఘవరెడ్డితో కలిసి ఆయిల్‌ఫాం నూతన కార్మాగార పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ వర్షాలతో సంబంధం లేకుండా ఖమ్మం జిల్లాలో 10 లక్షల ఎకరాలకు రెండు పంటలకు సాగునీరు అందేలా సీతారామ ఎత్తిపోతుల పథకం ద్వారా సరఫరా చేసేందుకు పెండింగ్ పనులకు సంబంధించి అంచనాలను సీఎం ఆమోదించారన్నారు. ఆయిల్‌పాం పంటకు ప్రభుత్వం అనేకరకాల సబ్సిడీ అందిస్తున్నదని, ఎకరం పంటతో లక్షల రూపాయలు సంపాదించవచ్చన్నారు. కార్యక్రమంలో ఆయిల్‌ఫెడ్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి, కల్లూరు ఆర్డీవో ఎల్.రాజేందర్, వ్యవసాయ, మార్కెటింగ్, ఉద్యానవన శాఖల అధికారులు, తెలంగాణ, ఆంధ్రా ఆయిల్‌ఫాం అధ్యక్షులు, ప్యాక్స్ డైరెక్టర్లు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

అపార్ట్‌మెంట్‌లో అగ్నిప్రమాదం
రూ.30 లక్షల ఆస్తినష్టం

ఘటనా ప్రదేశాన్ని పరిశీలిస్తున్న దృశ్యం

మామిళ్లగూడెం, మార్చి 30 : ఖమ్మం నగరంలోని ఓ అపార్ట్‌మెంట్‌లో ఆదివారం అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. వివరాల్లోకెళ్తే.. బుర్హాన్‌పురం ప్రాంతంలోని రవీంద్రనాథ్‌ఠాగూర్ నగర్‌లో నూతనంగా నిర్మించిన అపార్ట్‌మెంట్‌లోని మూడోఫ్లోర్‌లో ఓ ప్లాట్‌ను సత్తిరెడ్డి అనే వ్యక్తి కొనుగోలు చేశాడు. ఇంటీరియర్ పనులన్నీ పూర్తి చేసుకుని గృహప్రవేశానికి సిద్ధంగా ఉన్నాడు. ఆదివారం మధ్యాహ్నం అపార్ట్‌మెంట్ నుంచి దట్టమైన పొగలు, మంటలు రావడం గుర్తించిన స్థానికులు వెంటనే అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. వారు అక్కడికి చేరుకొని మంటలను అదుపు చేశారు. ఉగాది పండుగ కావడంతో ప్లాట్ యజమానులు తమ ప్లాట్‌లో పూజలు నిర్వహించి దీపాలు వెలిగించి తలుపులు వేసి వెళ్లినట్లు సోషల్ మీడియాలో ప్రచారం జరిగింది. కాగా విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ప్రమాదం జరిగిందని ప్లాట్ యజమాని సత్తిరెడ్డి తెలిపారు. సుమారు రూ.30 లక్షల వరకు ఆస్తినష్టం వాటిల్లినట్లు ఆవేదన వ్యక్తం చేశాడు.

చలివేంద్రం ఏర్పాటు

నేలకొండపల్లిలో చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎస్‌బీఐ మేనేజర్ సత్యనారాయణ

కూసుమంచి (నేలకొండపల్లి), మార్చి 30: నేలకొండపల్లిలోని భక్త రామదాసు సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో స్థానిక ఎస్‌బీఐ వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని బ్యాంక్ మేనేజర్ ఎన్‌వీ.సత్యనారాయణ ఆదివారం ప్రారంభించారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు ఏటుకూరి వెంకటరామారావు, సెక్రటరీ గెల్లా జగన్‌మోహన్‌రావు, కోశాధికారి దండా రవీందర్‌బాబు, వల్లంచట్ల భాస్కర్‌రావు, యలమద్ది లెనిన్, కనపర్తి కోటేశ్వరరావు, తెల్లగొర్ల లింగస్వామి, ఈసీ సభ్యులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

ధాన్యం కేంద్రాన్ని ప్రారంభిస్తున్న చైర్మన్ చంద్రారెడ్డి

కూసుమంచి, మార్చి 30: మండలంలోని జక్కేపల్లిలోని ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని చైర్మన్ నలబోలు చంద్రారెడ్డి ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకొని రావాలని కోరారు. కార్యక్రమంలో సీఈవో వీరారెడ్డి, డైరెక్టర్లు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

వెంకటయ్య వర్ధంతి

నివాళి అర్పిస్తున్న నాయకులు

తిరుమలాయపాలెం, మార్చి 30: మండలంలోని పిండిప్రోలులో సీపీఎం డివిజన్ నాయకుడు గజ్జెల వెంకటయ్య వర్ధంతి సభ ఆదివారం జరిగింది. తొలుత వెంకటయ్య స్మారక స్థూపం వద్ద నివాళి అర్పించి ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి కొమ్ము శ్రీను, నాయకులు దొండేటి ఆనందరావు, పద్మనాభుల సుధాకర్, దొడ్డ లింగస్వామి, కాంపాటి బాబురావు, పప్పుల ఉపేందర్, దాసరి మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ
నమస్తే తెలంగాణ దినపత్రికలో
చందా కొరకై మరియు పత్రికా పంపిణీలో
ఏమైన సమస్యలు ఉంటే సంప్రదించగలరు
సెల్ : 9182777073
నమస్తే తెలంగాణ దినపత్రికలో అన్ని రకాల
ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించగలరు
సెల్ : 9182777616

'విశ్వావసు' సంతోషమస్తు

జిల్లాలో ఘనంగా 'ఉగాది' పర్వదినం
అన్ని ఆలయాల్లో పంచాంగ శ్రవణాలు
ప్రత్యేక పూజలు చేసిన ప్రముఖులు

ఖమ్మం : వేంకటేశ్వరస్వామిని దర్శించుకున్న ఎంపీ వద్దిరాజు

కూసుమంచి: రామాలయంలో పంచాంగ శ్రవణంలో వేదపండితులు

వైరాటౌన్ : ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పూజలు

రఘునాథపాలెం : పంచాంగ శ్రవణం చేస్తున్న పూజారులు

ఖమ్మం : బీఆర్ఎస్ కార్యాలయంలో సండ్ర, తదితరులు

కారేపల్లి : గ్రామదేవతకు పూజలు చేస్తున్న గ్రామస్తులు

'విశ్వావసు' నామ సంవత్సర ఉగాది పర్వదినాన్ని జిల్లా ప్రజలందరూ ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. సంతోషాల 'విశ్వావసు' సంవత్సరం కావాలని భగవంతుణ్ని ప్రార్థించారు. ఆలయాలకు వెళ్లి ఇష్టదైవాలకు ప్రత్యేక అభిషేకాలు, పూజలు చేశారు. ఆలయ కమిటీ బాధ్యులు ఉగాది పండుగకు ప్రత్యేకమైన ఉగాది పచ్చడిని, తీరొక్క ప్రసాదాలను తయారు చేసి భక్తులకు అందజేశారు. ప్రముఖ ఆలయాల్లో పంచాంగ శ్రవణం చేశారు. దీనికి భక్తులు అధిక సంఖ్యలో హాజరై తమ పేరు, రాశి, జన్మనక్షత్రం ఆధారంగా నూతన సంవత్సరంలో భవిష్యత్తు ఫలాలను పురోహితులను అడిగి తెలుసుకున్నారు. ఆలయాల్లో దేవతా మూర్తులను దర్శించుకొని తన్మయత్వం పొందారు.

ప్రముఖుల పూజలు..

ఉగాది పర్వదినం సందర్భంగా ఉమ్మడి జిల్లాకు చెందిన ప్రముఖులు, బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర తన కుటుంబ సభ్యులతో కలిసి తిరుమల దేవదేవుణ్ని దర్శించుకున్నారు. తెలంగాణ ప్రజలు అష్టైశ్వర్యాలతో వర్ధిల్లాలని ప్రార్థించారు. అలాగే, తమ పార్టీ అధినేత, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి, తెలంగాణ జాతిపిత కేసీఆర్ ఆయురారోగ్యాలతో ప్రజా జీవితంలో నిండూ నూరేళ్లు విలసిల్లాలని వేడుకున్నారు. బీఆర్ఎస్ ఖమ్మం జిల్లా కార్యాలయంలో సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య, మణుగూరులోని బీఆర్ఎస్ మండల కార్యాలయంలో పార్టీ భద్రాద్రి జిల్లా అధ్యక్షుడు, పినపాక మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు, అశ్వారావుపేట మండలం వినాయకపురం ముత్యాలమ్మ ఆలయంలో మాజీ ఎమ్మెల్యేలు మెచ్చా నాగేశ్వరరావు, తాటి వెంకటేశ్వర్లు తదితరులు ప్రత్యేక పూజలు చేశారు.

– నమస్తే నెట్‌వర్క్

రోడ్డు ప్రమాదంలో బస్ కండక్టర్ మృతి

చెట్టును ఢీకొట్టిన ఆర్టీసీ బస్సు

పెనుబల్లి, మార్చి 30: రోడ్డు ప్రమాదంలో బస్ కండక్టర్ మృత్యువాత పడిన ఘటన ఆదివారం తెల్లవారుజామున కొత్తలంకపల్లి శివారులో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు.. సత్తుపల్లి డిపోలో కండక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న కల్లూరుకు చెందిన వన్నపురపు సీతారాంప్రసాద్ డ్యూటీ ముగించుకొని ఆదివారం తెల్లవారుజామున స్వగ్రామం కల్లూరు వెళ్లేందుకు హైదరాబాద్ బస్సు ఎక్కాడు. అంతలో విశాఖపట్నం నుంచి ఖమ్మం వెళ్తున్న ఖమ్మం డిపోకు చెందిన సూపర్‌లగ్జరీ బస్సు సత్తుపల్లి బస్టాండ్‌కు చేరుకోవడంతో త్వరగా ఇంటికి చేరుకోవచ్చని ఆ బస్సు ఎక్కాడు. బస్సు బయల్దేరి పెనుబల్లి మండలం కొత్తలంకపల్లి శివారు చేరుకోగానే రోడ్డుపక్కన నిలిపి ఉన్న ఆయిల్ ట్యాంకర్ వెనుక భాగంలో బస్సు ఢీకొనడంతో ఎడమవైపు భాగంగా పూర్తిగా ధ్వంసమైంది. ఈ ప్రమాదంలో బస్సులో ప్రయాణిస్తున్న కండక్టర్ సీతారాంప్రసాద్, మరో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న 108 సిబ్బంది రామకృష్ణ, రాధాకృష్ణ అక్కడకు చేరుకొని తీవ్రంగా గాయపడిన సీతారాంప్రసాద్‌ను పెనుబల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఈ ప్రమాదంలో ప్రయాణిస్తున్న గాయపడిన వారిలో ఒకరిని ఖమ్మం, మరో ఇద్దరికి సత్తుపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స అందిస్తున్నారు.

కల్లూరు హనుమాతండా వద్ద రోడ్డు ప్రమాదం

పెనుబల్లి, మార్చి 30: కల్లూరు మండలం హనుమాతండా వద్ద ఆర్టీసీ బస్సుకు ప్రమాదం చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో ఎవరికీ ఎటువంటి గాయాలు కాకపోవడంతో పెనుప్రమాదం తప్పిందని ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. స్థానికులు తెలిపిన వివరాలు.. ఖమ్మం నుంచి కల్లూరు వైపు వస్తున్న సత్తుపల్లి డిపోకు చెందిన పల్లెవెలుగు బస్సు కల్లూరు నుంచి హనుమాతండా వైపు ట్రాక్టర్ ధాన్యం లోడ్‌తో వెళ్తున్న ట్రాక్టర్ ట్రక్కు బస్సుకు తగలడంతో బస్సు అదుపు తప్పి పక్కనే ఉన్న చెట్టును ఢీకొట్టింది. దీంతో బస్సులో ఉన్న ఒకరికి గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న ఆర్టీసీ అధికారులు ప్రమాద స్థలానికి చేరుకొని ప్రమాదం జరిగిన స్థితిని గమనించారు.

చలివేంద్రం ప్రారంభం

చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న సీఐ

సత్తుపల్లి టౌన్, మార్చి 30: స్థానిక పోస్టాఫీసు సెంటర్‌లో సాయిమణికంఠ గణపతి నవరాత్రి కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని సత్తుపల్లి పోలీస్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కిరణ్ ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి సంవత్సరం క్రమం తప్పకుండా చలివేంద్రాన్ని ఏర్పాటు చేస్తూ వేసవికాలం బస్టాండ్ సెంటర్‌లో ప్రజల దాహార్తి తీర్చడం మంచి సేవా కార్యక్రమం అని నిర్వాహకులను అభినందించారు. కార్యక్రమంలో సాయిమణికంఠ గణపతి కమిటీ సభ్యులు, పురప్రముఖులు పాల్గొన్నారు.

కామన్ సర్వీస్ సెంటర్ వాహనం విస్తృత ప్రచారం

ప్రచారం నిర్వహిస్తున్న ఎస్సీ నిర్వాహకులు

మధిర(చింతకాని), మార్చి 30: డిజిటల్ ఇండియా కార్యక్రమంలో భాగంగా కామన్ సర్వీస్ సెంటర్ పథకాన్ని కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిందని, దీని ద్వారా ప్రజలకు వివిధ సంక్షేమ పథకాలు, వైద్య, విద్య, ఉపాధి, ఈ-మొబిలిటీ, గ్రామీణ ఈ-స్టోరీ, న్యాయ సేవలు, పర్యాటక, వ్యవసాయ సహకారం, ఇతర రంగాలకు సంబంధించిన సేవలు ప్రజలకు నేరుగా అందించేందుకు వీలుంటుందని సీఎస్సీ నిర్వాహకులు మరీదు ఆంజనేయులు అన్నారు. ఆదివారం చింతకాని మండలం నాగులవంచ గ్రామంలో కామన్ సర్వీస్‌సెంటర్ వాహన విస్తృత ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కామన్ సర్వీస్ సెంటర్‌నందు ఇన్సూరెన్స్, బ్యాంకింగ్ సర్వీసెస్, టెలీలా, పీఎంకిసాన్ సర్వీస్, అగ్రికల్చర్ సర్వీసెస్ తదతర సర్వీసెస్ కలవని, మరికొన్ని సర్వీసెస్ రాబోతున్నాయని తెలిపారు. కార్యక్రమంలో అంబటి శాంతయ్య, చావా అరుణ్‌కుమార్, కొండ గోపి, సందీప్‌రెడ్డి, కోటేశ్వరరావు, శివ, ఖాసీం, సాయి పాల్గొన్నారు.

కాంగ్రెస్ గ్యారెంటీలు నీటి మూటలేనా.. ?

మాట్లాడుతున్న శీలం సత్యనారాయణ

పెనుబల్లి, మార్చి 30: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన గ్యారెంటీలు నీటి మూటలే అని సీపీఎం సత్తుపల్లి డివిజన్ కార్యదర్శి శీలం సత్యనారాయణ అన్నారు. ఆదివారం స్థానిక చలమాల సూర్యనారాయణభవనంలో జరిగిన మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రజలను ఎంతకాలం మధ్య పెడతారని, గ్యారెంటీలు నీటి మూటలేనా అని ప్రశ్నించారు. ముగ్గురు మంత్రులు ఉండి జిల్లా సాగునీటి ప్రాజెక్టులు ఇందిరమ్మ ఇళ్ల కోసం అధిక నిధులు సాధించడంలో వైఫల్యం చెందారని విమర్శించారు. సమావేశంలో విఠల్‌రావు, గాయం తిరుపతిరావు, మిట్టపల్లి నాగమణి, చెమట విశ్వనాథం, నల్లమల అరుణప్రతాప్, చలమాల నరసింహారావు, తడికమళ్ల చిరంజీవి, గుడిమెట్ల బాబు, చిలక రామచంద్రుడు, కలకోట అపాపరావు పాల్గొన్నారు.

గ్రామ దేవతలకు బోనాలు

బొడ్రాయి వద్ద పూజలు నిర్వహిస్తున్న భక్తులు

బోనకల్లు, మార్చి 30: మండలంలో చిరునోముల, బోనకల్లు గ్రామాల్లో ఉగాది పండుగను పురస్కరించుకొని భక్తులు ఆదివారం పెద్ద ఎత్తున గ్రామదేవతలకు బోనాలు సమర్పించారు. ఈ సందర్భంగా బొడ్రాయి వద్ద భక్తులు పసుపు, కుంకుమ సమర్పించారు. ముత్యాలమ్మకు ప్రత్యేకంగా నైవేద్యంతో పాటు, పలు రకాల పిండి వంటలు తయారు చేసుకొని అమ్మవారికి సమర్పించారు. ఉదయాన్నే గ్రామాల్లో ప్రతి ఇంట ఉగాది పండుగ సందర్భంగా ఉగాది పచ్చడి తయారు చేసుకొని ప్రసాదంగా స్వీకరించారు.

పేదలకు భోజన ప్యాకెట్లు అందజేత

సత్తుపల్లిటౌన్, మార్చి 30: విశ్వావసు నూతన తెలుగు సంవత్సర ప్రారంభం సందర్భంగా సత్తుపల్లి పట్టణంలో నవచైతన్య చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో పేదవారికి భోజనం, పండ్లు పంపిణీ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. కులమతాలకు అతీతంగా అన్ని పండుగ వేడుకలను పేద వారితో కలిసి పంచుకోవాలని సంస్థ అధ్యక్ష, కార్యదర్శులు కోరారు.

మండలంలో డిప్యూటీ సీఎం పర్యటన

గ్రామస్తులతో ముచ్చటిస్తున్న డిప్యూటీ సీఎం భట్టి

ఎర్రుపాలెం, మార్చి 30: ఎర్రుపాలెం మండలం కాచవరం, గుంటుపల్లిగోపవరం గ్రామాల్లో ఆదివారం డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పర్యటించారు. ఉగాది పండుగను పురస్కరించుకొని సాయంత్రం కాచవరం గ్రామంలోని ఓం శ్రీపార్వతి సమేత అమృత లింగేశ్వరస్వామి వారి దేవాలయంలో శివుడికి ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం గ్రామస్తులతో ముచ్చటించారు. పొదుపు సంఘంలో ఉన్న మహిళలకు ఇందిరమ్మ డైరీ పథకంలో సబ్సిడీపై గేదెలు ఇస్తామని చెప్పారు. కాచవరంలో రేషన్‌షాపు లేనందున లక్ష్మీపురం గ్రామానికి వెళ్లి తెచ్చుకోవడం ఇబ్బందిగా ఉందని, గ్రామంలోని రేషన్ దుకాణాన్ని ఏర్పాటు చేయాలని గ్రామస్తులు విజ్ఞప్తి చేశారు. ముందుగా గ్రామస్తులు భట్టి విక్రమార్కకు మంగళ హారతులు పట్టి స్వాగతం పలికారు. కాంగ్రెస్ నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

జమలాపురంలో ప్రారంభమైన బ్రహ్మోత్సవాలు

తీర్థపు బిందెను తీసుకొస్తున్న ఆలయ అర్చకులు

ఎర్రుపాలెం, మార్చి 30: జమలాపురం వేంకటేశ్వరస్వామి ఆలయంలో వసంత నవరాత్రి బ్రహ్మోత్సవాలు ఆదివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. వేదమంత్రోచ్చారణలు, మంగళ వాయిద్యాల నడుమ సాయంత్రం 5 గంటలకు తీర్థపుబిందెను సాంప్రదాయబద్ధంగా తెచ్చుటతో ఉత్సవాలకు అంకురార్పణ జరిగింది. ఆలయ ప్రధాన అర్చకులు ఉప్పల శ్రీనివాసశర్మ శ్రీవిశ్వావాసు పంచాంగ శ్రవణాన్ని భక్తులకు వివరించారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణ అధికారి కొత్తూరు జగన్మోహన్‌రావు, ఆలయ ఫౌండర్ ట్రస్ట్ ఉప్పల శ్రీరామచంద్రమూర్తి, మాజీ వ్యవస్థాపక ధర్మకర్త ఉప్పల కృష్ణమోహన్‌శర్మ, వకులామాత స్టేడియం నిర్మాణ దాత తుళ్లూరి కోటేశ్వరరావు పాల్గొన్నారు.

జనరల్ మేనేజర్‌ను కలిసిన ఐఎన్‌టీయూసీ నాయకులు



షాలెంరాజుకు శుభాకాంక్షలు తెలుపుతున్న ఐఎన్‌టీయూసీ నాయకులు

సత్తుపల్లిటౌన్, మార్చి 30: సింగరేణి కొత్తగూడెం ఏరియా సింగరేణిలో అత్యధిక ఉత్పత్తి, రవాణా సాధించేందుకు దిశా నిర్దేశం చేసిన జనరల్ మేనేజర్ షాలెం రాజును ఐఎన్‌టీయూసీ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ త్యాగరాజన్, కొత్తగూడెం ఏరియా వైస్ ప్రెసిడెంట్ రజాక్ కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కొత్తగూడెం ఏరియాలో వీకే-7 మైన్ అనుమతులు రావడానికి కృషి చేసిన అధికారులకు అభినందనలు తెలియజేస్తూ వీకే-7 మైన్ సింగరేణి ఉద్యోగులతోనే ఉత్పత్తి ప్రారంభించాలని కోరారు. భవిష్యత్‌లో సింగరేణి పురోభివృద్ధికి జనక్‌ప్రసాద్ నాయకత్వంలో ఐఎన్‌టీయూసీ యూనియన్ పూర్తి సహాయ సహకారాలు అందిస్తుందని తెలిపారు.

అక్రమ అరెస్టులకు ఖండన

ఖమ్మం అర్బన్, మార్చి 30 : హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీకి చెందిన విద్యార్థులను పోలీసులు అక్రమంగా అరెస్ట్ చేయడాన్ని పీడీఎస్‌యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి వెంకటేష్ ఖండించారు. యూనివర్సిటీల అభివృద్ధికి కృషి చేయాల్సిన ప్రభుత్వమే ఏకంగా భూములను కొల్లగొట్టాలని చూడడం దారుణమని, భూముల అమ్మకాన్ని విరమించుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఉద్యమాలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

'శీతల పానీయాలు మానండి'

ఖమ్మం అర్బన్, మార్చి 30 : ''శీతల పానీయాలు మానండి.. సహజ పానీయాలు తాగండి'' అంటూ ఉగాది పండుగ సందర్భంగా జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో పెవిలియన్ గ్రౌండ్‌లో ఆదివారం అవగాహన కల్పించారు. క్రీడాకారులకు ఉగాది పచ్చడి అందించి, శీతల పానీయాలు వల్ల కలిగే నష్టాలను తెలియజేసే కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మోహన్, రామారావు, శివనారాయణ, పురుషోత్తం, సీతారామారావు, డాన్‌బోస్కో పాల్గొన్నారు.

యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఉగాది వేడుకలు...

టీఎస్ యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఆదివారం ఆ సంఘం కార్యాలయంలో ఉగాది వేడుకలను నిర్వహించారు. ఉగాది పచ్చడిని పంపిణీ చేశారు. కార్యక్రమంలో రంజాన్, నాగేశ్వరరావు, రాజశేఖర్, వీరబాబు పాల్గొన్నారు.

మంత్రి తుమ్మలకు ఆహ్వానం

సత్తుపల్లిటౌన్, మార్చి 30: మండల పరిధిలోని బేతుపల్లి గ్రామంలో ఏప్రిల్ 12 నుంచి జరిగే అంకమ్మతల్లి తిరునాళ్ల ఉత్సవాలకు రావాలని కోరుతూ ఆలయ కమిటీ సభ్యులు, బేతుపల్లి గ్రామ పెద్దలు మంత్రి తుమ్మల నాగేశ్వరరావును ఆదివారం గండుగులపల్లిలోని ఆయన కలిసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా బేతుపల్లి గ్రామపెద్దలు, ఆలయ కమిటీ సభ్యులతో కలిసి మంత్రి తిరునాళ్ల మహోత్సవ బ్రోచర్లను ఆవిష్కరించారు. తుమ్మలను కలిసిన వారిలో చల్లగుండ్ల లోకేశ్వరరావు, అజయ్‌బాబు, కొప్పుల వేణు, కొప్పుల శ్రీను తదితరులు ఉన్నారు.

మృతదేహం లభ్యం

పెనుబల్లి, మార్చి 30: మండలంలోని పాతకారాయిగూడెం ఎన్ఎస్పీ కాలువలో గుర్తుతెలియని మృతదేహం ఆదివారం కొట్టుకువచ్చింది. స్థానికులు గుర్తించి వీ.ఎం.బంజర పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు అక్కడకు చేరుకొని మృతదేహాన్ని కాలువలో నుంచి బయటకు తీయించి పంచనామా నిర్వహించారు. అనంతరం మృతదేహాన్ని పెనుబల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడి కుడిచేతికి ఆంజనేయస్వామి పచ్చబొట్టు ఉన్నట్లు గుర్తించారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

రంజాన్ తోఫా అందజేత

రంజాన్ తోఫా అందజేస్తున్న మందడపు అశోక్

పెనుబల్లి, మార్చి 30: మండల పరిధిలోని లంకాసాగర్‌లో ముస్లింలకు పవిత్ర రంజాన్ పండుగను పురస్కరించుకొని మాజీ సర్పంచ్, సర్పంచ్‌ల సంఘం మండల మాజీ అధ్యక్షుడు మందడపు అశోక్‌కుమార్ రంజాన్ తోఫా అందజేశారు.